199

# హోమ్ స్వీట్ హోమ్ (2)

ఎప్పుడైనా మీ శ్రీవారిని గిల్లారా?

అత్తగారు కాని మావగారు కాని ఆడబడుచులుకాని, మరుదులు కాని ఎవరూ చూడకుండా ఓమారు గిల్లిచూడండి.

రహస్యంగా మీ కోపా వచ్చేస్తే మంచి మొగుడన్నమాట.

కసురుకుంటే "క్రీక్!", "అమ్మో చూడే యిది గిల్లుతోంది"

అని పబ్లికున బయటపడితే మొద్దబ్బాయి అన్నమాట. మీరు పడగ్గదిలో స్కూలువోపెన్ చేసి ఎ బి సి. డి. ల. దగ్గర్నుంచు ఎక్కాల వరకూ ఓపిగ్గా నేర్చుకోవాల్సిందే. మీరు గిల్లినపుడు పూరుకొని మళ్ళీ గిల్లాడను కోండి. పోనీ మళ్ళీ గిల్లకుండా మీ కాలు తొక్కాడను కోండి. అప్పుడు మీరు "అమ్మనాబోయ్ అని డాన్సు చేయకూడదు. మీరు గిల్లబట్టికదా అతగాడు మీ కాలు త్రొక్కింది అని సరిపెట్టుకు పోవాలి.

కళ్ళతో ఎప్పుడైనా మాట్లాడుకున్నారూ? రాక్షసుల వంటి పెద్దాళ్ళమధ్య మెలగాల్సిన దంపతులు న్యూలీవెడ్సుకి యింకా బైటపడి రంగలో దూకని ప్రేమికులకి కళ్ళతో మాట్లాడుకోవడం వినా అన్య ధాశరణం నాస్తి! ఈ భాషా సమస్యతో దేశమంతా ఇలా గగ్గోలు పడి పోతోంది కాని ప్రేమికులు తమ భాషా సమస్యను ఏనాడో అవలీలగా పరిష్కరించేశారు.

కాలు త్రొక్కడం. గిల్లడం. కళ్ళతో మాట్లాడుకోవడం ఇవే కాకుండా నవ్వడం. దగ్గడం కూడా కొంతవరకు జవ్వనుల ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయడానికి ఉపయోగిస్తాయి.

మీరు నవ్వారనుకోండి.

అతగాడు దగ్గుతాడు.

దగ్గిన తరువాత మీరతని కళ్ళలోకి చూస్తే మీకు వైర్‌లెస్ అందుతుంది. అదంతా ప్రేమికుల టెక్నిక్....అసలు ముందు ప్రేమ స్టాకులో వుండాలికాని టెక్నిక్ తరువాత దానంతటదే అలవడుతుంది.

యంగ్ కపుల్సుకి పెద్దాళ్ళు యమడేంజర్- పరమబోరుగాళ్ళు.

అమ్మాయిగారి దగ్గర్నుంచి చిన్న కిస్ లాగాలని అబ్బాయి ఎర్లీ మార్నింగ్ నుంచి ట్రయిచేస్తున్నాడనుకోండి. ఆఫ్టరాల్ చిన్న కిస్సే- హావుటు గెటిట్!

"అమ్మా అలివేణీ మీ మామగారికి చుట్ట కాల్చుకుందుకు నిప్పు పట్టికెళ్ళమ్మా అని షీ డెవిల్ అత్తగారు నన్నాయి నొక్కులు నొక్కుతుంది.

తల్లీ మినప్పప్పు నానబోశాను. కడిగి పత్రా అమ్మా రుబ్బుకుందాం. మీ ఆయనకు కారపు గార్లిష్టం!

ఏవోఁ మరదలా- ఈ జాకెట్టుకి బటన్స్ కుట్టి పెడుదూ ఇప్పుడే వస్తా-"

"కోడలు పిల్లా నువ్వొకలసి ఆ మంచం నవారు వూడతీసి చాకలికి వడేయండి. నల్లగా కుళ్లు కంపుకొడుతోంది.

"బాత్ రూంలో చక్కా బట్టలుతుక్కుందాంరాదూ?"

"కళ్లు చిల్లులడి పోతున్నాయ్. ఆ బియ్యం కాస్త నాలుగు రోజులకి సరిపడేలా చెరిగి ఏరి శుభ్రంచేసి డబ్బాలో పోయండి."

"ఏవేఁ పిల్లా బూడిద గుమ్మడికాయ వొడియాలు పెట్టుకుందావేఁ"

వాటే షీర్ నాన్సెన్స్?

ఐ హావ్ పెయిడ్ కట్నంటుమై హజ్బెండ్. నాట్ ఫర్ బూడిద గుమ్మడికాయ వొడియాలు. నాట్ ఫర్ బాత్రూంలో బట్టలుతకడం. నాట్ ఫర్ బటన్స్ కుట్టడం. ఆర్ మావగారి చుట్టకు నిప్పు తీసుకెళ్ళ

దం - సినిమాల్లో ఏ హీరోయినైనా బట్టలుతుకుతుందా? బూడిద గుమ్మడికాయ వొడియాలు పెడుతుందా- నో - నో - హాయిగా లవ్ డాన్సులు చేస్తుంది. హీరో హీరోయినూ కలిసి ధైర్యంగా సంఘాన్ని ఎదిర్చి నిలబడతారు. వాళ్ళిద్దరూ జంటగా హాయిగా డైరెక్టరు చెప్పి నట్లు హై క్లాసుగా జీవిస్తారు.

అందుకని సరదాగా వుండడం కోసం గిల్లమంటే బావగారిని గిల్లాలికాని అత్తగార్ని. అరబడుచుల్ని గిల్లకూడదు.

తెల్లారాక మొగుడి కవుగిలిలోంచి బైటపడి పళ్ళు తోముకుని. కాఫీ తాగాక మళ్ళీ సన్ సెట్టయ్యే వరకూ.అప్పట్నుంచి రేడియో వాళ్ళు జనగణమన పాడే వరకూ ఒక చిన్న కిస్. చిన్న నవ్వూ త్రుళ్ళూ లేకుండా దర్జీగా కంచాలు కడగడ్డం. పిండి రుబ్బడం. వొడి యాలు పెట్టడం. బట్టలుతకడం. బియ్యం ఏరడం. ఛ ఛ వ్వాట్ యే నీరసం? సాయంత్రానికి శ్రీవారు ఈల వేస్తూనే వుంటారు. నిద్ర కూరుకు వచ్చేస్తుంది ఇది నిద్ర మోతు రాస్కేల్ అని విసుక్కుంటారు. ఐ దోంట్ కేర్ - అలిసిపోయి వొళ్ళుతెలియని నిద్ర పోతా....అప్పు డిహ పాడుకుంటూ చెట్ల చుట్టూ పరిగెత్తడానికి వోపిక వుండదు.

అసలు ప్రేయసీ ప్రియులు. మొగుడూ పెళ్ళాల మధ్య పాడు కోవటం ఎట్లా....ఎన్ని రేడియోలు ఎన్ని గ్రామఫోను రికార్డులు పెడితే మొగుడూ పెళ్ళాలు కలిసి పాడుకున్న సొగసు వస్తుంది?

అసలు మన్ని జీవితంలో పాడుకోనివ్వరు. ఆడుకోనివ్వరు.

అంట్లుతోముకోమంటారు. రెచెడ్ లైఫ్ ప్రేమ పాటలు పాడుకోకుండా సయ్యాటలాడ కుండా. వెన్నెట్లో విహారాలు చెయ్యకుండా చీకటి గదుల్లో చెమట కంపులో కళ్ళుమూసుకు వెంకటేశ్వరస్వామిని

తల్లుతుంటూ అంతా పాపం అసహ్యం అని దోక్కుంటూ సంసారాలు చెయ్యాలంటారు. ఒక బేడా యివ్వండి మల్లెపూలు కొనుక్కుంటాను ఒక అణా ఇవ్వండి అగ్గిపెట్టె తెప్పిస్తాను. ఒక పెసరట్టు రెండిడ్లీ పొట్లం కట్టించుకు పట్రండి. (మంచంమీద కూర్చుని తినడం. తరువాత దోక్కోవడం) దోక్కుంటే గవర్నమెంటుకి కోపం. గవర్నమెంటుకి వేవిళ్ళన్నా. గర్భవతులన్నా గర్భశత్రువులన్నమాట।

అక్కడ నుంచి పురుడోసుకుని ఆస్పత్రిలో యింట్లో పీతిగుడ్డలు తుక్కోవడం. పాంసీసాలు కడుక్కోవడం — లైఫ్ యీజ్ లైక్ దట్। లైఫ్‌లో ఛాం ఏముంది?

అప్పుడిహ నవ్వడాలు. దగ్గులు. గిల్లడాలు గిల్లికజ్జాలు అన్నీ పోతాయ్

టానిక్కులు. పాలడబ్బాలు బట్టల సబ్బులు. వంటపొయ్యి. కుంపటి శరణ్యమవుతాయి.

అరుపులు. జీతం చాలకపోడాలు. చుట్టాలూ అప్పులాళ్ళూ ప్రత్యక్షమవుతారు.

ఫిట్లొస్తాయి.
జడేసుకోడానికి టైముండదు.
ముడేసుకు తిరగడం.

పిల్లలుచ్చపోసుకున్న చీరతో మొగుడి చాయలకు పోతే చివాట్లు. దెబ్బలు తప్పవు.

సినిమాహాల్లో కూర్చున్నా అప్పడాల డబ్బామీద మూత మర్చిపోయానేమో. పాలగిన్నె పిల్లిబోర్లతోసేస్తుందేమో. డాబామీద ఆరేసిన చీరయింట్లో తెచ్చిపెట్టుకోడం మర్చిపోయామే అని. వంపొస్తుందో

రాదో. కరెంటు వుంటుందో వుండదో. రాత్రి నిద్రపడుతుందో పట్టదో. బొగ్గులబస్తా తడిసిపోతుందేమో వర్షం వస్తే. కట్టెలు కాజేస్తారేమో.... అన్నీ బెంగలే. అన్నీ సంశయాలే. అన్నీ అనుమానాలే।

గిల్లికజ్జాలాడుకోవడానికి. కజ్జికాయలు తినడానికి. డాబామీద కూర్చొని కబుర్లు చెప్పుకోవడానికి అసలు టైమేదీ?

అంచాత మన సొసైటీలో కుర్రాళ్ళు కాస్త సరదాగా వుంటే కళ్ళల్లో నిప్పులు పోసుకోకండి।

పిండి రుబ్బుకోవడానికి వొడియాలు పెట్టుకోడానికి. గుడ్డలు తుక్కోడానికి లైఫ్‌లో బోల్డు టైముంటుంది.

బైదిబై మీరెప్పుడైనా శ్రీవారిని గిల్లారా? గిల్లి చూడండి. ఏడుపుమొహం పెడితే పాపం మళ్ళీ గిల్లకండి.